నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ కెనరానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11.00గంటల నుంచి మధ్యాహ్నం 2.00గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, కెనరానగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ ఎన్ఐఎన్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలలో కరెంటు ఉండదని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ ఆర్టీసీకాలనీ 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు గణేష్ నగర్, ఇంద్రానగర్, బృందావన్‌కాలనీ, మాత అరవిందకాలనీ, ఆదర్శనగర్, వెంకటాద్రినగర్, ఆర్టీసీ కాలనీ, హిమగిరి కాలనీ, హరిప్రియకాలనీ, సుశీల టౌన్‌షిప్, రంగ రంగయ్యనగర్‌లలో కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అల్వాల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం అల్వాల్‌లోని 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు చంద్రపురం కాలనీ, మంగపురం కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు హెచ్ఎంటీ ఆఫీసర్స్ కాలనీ, పంచశీల కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


కాంగ్రెస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

గౌతంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం గౌతంనగర్‌లో కాంగ్రెస్ నేత మోహన్‌రాజు నివాసంలో కాంగ్రెస్ నేత శ్రీనివాసన్ బృందంతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. నేతలు వెంకటేష్‌యాదవ్, జీఎన్‌వి. సతీష్‌కుమార్, బోనగిరి పాండు, క్రాంతి, దాస్, ప్రవీణ్, ఫరీద్, సత్యనారాయణ, మణి, బాలు, రాబర్ట్, రాజశేఖర్ తదితరులున్నారు.

ఓపెన్ కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మల్లాపూర్: ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో నాచారంకు చెందిన విద్యార్థులు పతకాల పంట పండించారు. రెండో అంతర్జాతీయ కరాటే పోటీల్లో భారత్‌తో పాటు నేపాల్, శ్రీలంక, చైనా, సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన వారు పాల్గొన్నారు. భారత్ తరపున నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఏ.సారా, ఎన్.కీర్తి, కార్తీక, ఎన్.యువాన్, కె.తీయ, కె.చందన్, ఎన్.నితీష్, సాకేత్, సాహితీ, అనిషా, ప్రవీణ్ స్వర్ణం, కాంస్య పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులను స్థానికులు అభినందించారు.

కార్పొరేటర్‌కు సత్కారం

మల్లాపూర్: పన్నాల దేవేందర్‌రెడ్డి మల్లాపూర్ డివిజన్‌కు రెండోసారి కార్పొరేటర్‌గా ఎన్నికై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక నేతలు ఆయనను సత్కరించారు. మంగళవారం వార్డు కార్యాలయంలో దేవేందర్‌రెడ్డిని కలిసిన స్థానిక నేతలు శాలువాతో సత్కరించారు. గత 9 ఏళ్లుగా డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సహకారం అందించిన ప్రజలు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కట్ట శ్యామ్

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లో నివాసం ఉండే కలంబో కట్టు శ్యామ్ (42)గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యం మానేసి మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈనెల 9న రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాల్లో
ప్రత్యేక పాలన !

15న ముగియనున్న పాలకవర్గాల గడువు

పదవీకాలం పొడిగింపుపై సందిగ్ధత

ఎన్నికల ఊసెత్తని ప్రభుత్వం


ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం భవనం

ఘట్‌కేసర్ : అన్నదాతలకు మెరుగైన సేవలు అందిస్తున్న రైతు సేవా సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 15, 2025తో ముగియనుంది. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం, సకాలంలో పంటరుణాలు అందజేయడం సహకార సంఘాల ప్రధాన విధులు. కాగా సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం ముందస్తు కసరత్తు చేయకపోవడం, ప్రభుత్వ ప్రకటన వెలువడకపోవడంతో ప్రత్యేక పాలన తప్పదనిపిస్తోంది.

అధికారుల నియామకానికి చర్యలు..

మూడు రోజుల్లో సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగియనుండటంతో ప్రత్యేక అధికారులను నియమించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. మరో 10 రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సహకార సంఘాల ఎన్నికలు పంచాయతీ, మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికల అనంతరం జరుగనున్నాయి. ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికల ఊసెత్తకపోవడం నిజమేననిపిస్తోంది.

గడువు పొడిగించాలంటున్న పాలకవర్గాలు..

ప్రత్యేక పాలనలో నిర్ణయాలన్నీ ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతాయన్నది జగమెరిగిన సత్యం. సమస్యలు వచ్చినప్పుడు అధికారులు స్వతహాగా నిర్ణయం తీసుకోలేరు. దీంతో ప్రత్యేక అధికారులు పాలనలో ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉన్న బ్యాంకు కార్యకలాపాలపై ప్రభావం పడుతుంది. గత పాలకవర్గం పదవీకాలం రెండేళ్లు పొడగించిన విధంగానే ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం 6 నెలల పాటు పొడిగించాలని కోరుతున్నారు.

ఆసక్తి చూపని ప్రభుత్వం...

ప్రస్తుత పాలకవర్గాలు ఫిబ్రవరి 16, 2020న ప్రమాణ స్వీకారం చేసినందున 15తో పదవీకాలం ముగుస్తుంది. పదవీకాలం ఉండగానే 6 నెలల ముందు ప్రభుత్వం ఎన్నికల కసరత్తు చేయాల్సి ఉంది. కానీ పాలకవర్గాలకు మరో మూడ్రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారుల పాలన ఖాయమని తెలుస్తోంది.

కొత్త సంఘాల ప్రతిపాదనలు...

గత ప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీనికి అవసరమైన ప్రక్రియపై అధికారులు, ప్రజల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. కానీ కొత్త సంఘాలను ఏర్పాటు చేయలేదు. ఇది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలనుకుంటే కొత్త సంఘాల ఏర్పాటు తర్వాతే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీంతో ప్రత్యేక అధికారుల పాలన పొడిగించడం అనివార్యం అవుతుంది. ఈ విషయమై ఎండీని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని వివరించారు.

పదవీకాలం పొడిగించాలి..



రైతు సేవా సహకార సంఘం పదవీకాలం మూడు రోజులే ఉంది. అధికారుల పాలన అమలు సాగనున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్నందున ప్రత్యేక అధికారుల పాలన రైతుల సమస్యలు తీర్చలేరు. పాలకవర్గాల పదవీకాలం పొడిగించడమే మంచి మార్గం.

– బొక్క స్రవంతికృష్ణారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్

ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవిస్తాం



ఐదేళ్ల పదవీకాలంలో రైతు సేవా సహకార సంఘాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేశాం. అన్నదాతలకు మెరుగైన సేవలందించాం. పాలకవర్గం పదవీకాలం పొడిగింపుపై ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం.

–సింగిరెడ్డి రాంరెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్

నాలాలో కబ్జాల తొలగింపు


నాలాలో షెడ్డును తొలగింపజేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రామంతాపూర్: నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు, కబ్జాలపై సాక్షిలో 'నాలా ఇంకెన్నాళ్లిలా..?' మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు స్పందించి మంగళవారం సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి కబ్జాలను తొలగించారు. త్వరలోనే నాలా పూడికతీత పనులను కూడా చేపడతామని వివరించారు. రామంతాపూర్ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలపై సాక్షి ప్రచురిస్తున్న కథనాల ద్వారా పరిష్కారాలు చూపుతున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యం

రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన


క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన

రామంతాపూర్: క్రీడలతో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు దేహదారుఢ్యం, ఆరోగ్యం పెంపొందుతుందని రాష్ట్ర సాంకేతిక విద్య రీజినల్ డైరెక్టర్ శ్రీనాథ్, సెక్రటరీ పుల్లయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి స్పోర్ట్స్ మీట్ దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో చదువుతో పాటు సంస్కారం అలవరుతుందని, మైదానంలో ఆడే క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ రేణుక, అధ్యాపకులు, పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా జట్లు పాల్గొన్నాయి.


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

విద్యతో పాటు విలువలు నేర్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

కుషాయిగూడ: విద్యార్థులకు విద్యతో పాటు విలువలను కూడా నేర్పించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ న్యూ నర్సింహ్మనగర్‌లోని వాగ్దేవి హైస్కూల్‌లో మంగళవారం జరిగిన పాఠశాల 13వ వార్షికోత్సవ వేడుకలను హెచ్‌బీకాలనీ, మల్లాపూర్ కార్పొరేటర్లు ప్రభుదాస్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కావొద్దని, అన్ని రంగాల్లో రాణించినప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువవుతారన్నారు. వారి అభిరుచులకు తగినట్లుగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపైనే ఉందన్నారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరా, మైక్ ఏర్పాటు


సీసీ కెమెరాను ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయడంతో ప్రజలకే నష్టం కలుగుతుందని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం బీజేఆర్‌నగర్ కాలనీలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోసే ప్రాంతంలో సీసీకెమెరా, మైక్ ఏర్పాటును ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చే వారికి వ్యర్థాలను అందజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఏఎంహెచ్ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, వేంకటేశ్వరనగర్ కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయ 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వాసవి క్లబ్ ఆఫ్ మీర్‌పేట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ గవర్నర్ సీహెచ్. రాంచందర్, అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాదం చారి, సెక్రటరీ పీవీజీ రాజారావు, కోశాధికారి వీరభద్రరావు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు నేర్లకంటి శ్రీనివాస్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, నాగేందర్, మల్లేశ్వర్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్

బోడుప్పల్: 13వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో రూ.12 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ దానగల్ల అనితాయాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో రూ.7కోట్లతో డివిజన్‌ను అన్ని రకాల అభివృద్ధి చేశామన్నారు.రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యను ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దానగల్ల యాదగిరి, డివిజన్ అధ్యక్షులు గోపు రాము, రమేష్, నాగరాజు, సందీప్, సిద్దులు, రవి పాల్గొన్నారు.

విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

నిందితుడి రిమాండ్, పోక్సో కింద కేసు నమోదు

మేడిపల్లి: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ పాఠశాల ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్‌లో ఉంటున్న పానుగోటి రవీందర్‌రావు (55) బోడుప్పల్‌లోని ఓ టెక్నో హైస్కూల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా పాఠశాలలోని విద్యార్థినులను తన రూమ్‌లోకి పిలుచుకుని అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సదరు పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీసీ ఫుటేజీల ఆధారంగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

జబల్‌పూర్ ఘటనపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: మధ్యప్రదేశ్ జబల్‌పూర్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నాచారం ప్రాంతానికి చెందిన భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంపీ ఈటల రాజేందర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతదేహాలకు త్వరగా పోస్టుమార్టం పూర్తిచేసి స్వస్థలాలకు పంపేలా చొరవ చూపాలని కోరారు.

నేడు కీసరగుట్ట బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం

కీసర: రాష్ట్రంలో సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు నేడు ఉదయం దేవాలయం ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ ప్రకటించారు. ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

అల్వాల్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని 'నో ఫుడ్ వేస్ట్' ఎన్జీవో సంస్థ వాలంటీర్ కరుణశ్రీ అన్నారు. మంగళవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రీ యూజబుల్ శానిటరీ నాప్‌కిన్స్‌ను ఆమె పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మంచి చెడులపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోటనీ హెడ్‌గా ప్రొ.సబితారాణి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ బోటనీ విభాగం హెడ్‌గా ప్రొ.సబితా రాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హెడ్‌గా పని చేసిన ప్రొ.రమాదేవి కాల పరిమితి ముగియడంతో ప్రొ.సబితా రాణిని హెడ్‌గా నియమిస్తూ ఓయూ వీసీ ప్రొ.కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాటనీ విభాగం పార్ట్‌టైం అధ్యాపకులు డా.సుమన్‌కుమార్, డా.రామగాళ సుందర్, కిరణ్‌కుమార్, డా.రఘు, డా.మంజుల, డా.పరమేష్ తదితరులు సబితా రాణికి అభినందనలు తెలిపారు.

'సెల్ట్ 'లో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ అనుబంధ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజెస్ ట్రైనింగ్ (సెల్ట్)లో స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 10 ఆ పైన విద్యార్హత గల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారులు, తదితరులు అర్హులని డైరెక్టర్ ప్రొ.సాడ సవీన్ పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా థామస్ అల్వా ఎడిసన్ జయంతి


ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాప్రా: తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ 187వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలానగర్‌లోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వెలుగులు విరజిమ్ముతున్న విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి ఉపకరణాలు రూపొందించిన గొప్ప శాస్త్రవేత్త అని కొనియాడారు. పరిశోధనా రంగంలో అనేక విధాలుగా థామస్ అల్వా ఎడిసన్ కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పారిశ్రామికరంగం అభివృద్ధికి ఆయన చేసిన విద్యుత్ బల్బుతో చాలా ప్రయోజనం చేకూరిందన్నారు. టెలిగ్రాఫ్‌ను కనుగొని దూరప్రాంతాలకు సందేశాన్ని పంపించే వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు దోహదపడిందన్నారు. యాదగిరిరావు, శివరామకృష్ణ, గణేష్, చంద్రశేఖర్, శోభ, గొస్య తదితరులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థులతో గొడవ

తండ్రి మందలించాడని విద్యార్థి అదృశ్యం


మహ్మద్ హాకీబ్

కుషాయిగూడ: తోటి మిత్రులతో గొడవపడిన కుమారుడిని తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది కనిపించకుండా పోయిన ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ, వాసవీశివనగర్‌కు చెందిన షేక్ జానీపాషా బైక్ మెకానిక్. అతడి కుమారుడు మహ్మద్ హాకీబ్ (11) డీఏఈ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. హాకీబ్‌ను తండ్రి రోజులానే మంగళవారం స్కూల్‌కు తీసుకెళ్లి సాయంత్రం తిరిగి ఇంటి దగ్గర వదిలాడు. స్కూల్‌లో తోటి విద్యార్థులతో గొడవపడిన విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడిని మందలించి కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన హాకీబ్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులను ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై ఉన్నతాధికారుల అసంతృప్తి


ఆనంద్‌బాగ్ చౌరస్తాలో పర్యటిస్తున్న అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పారిశుద్ధ్యంపై ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో పలుమార్లు స్థానిక కార్పొరేటర్ శానిటేషన్ పరిస్థితులపై ఫిర్యాదు చేశారు. మంగళవారం శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, డీసీ రాజు స్వయంగా పరిశీలించారు. కార్పొరేటర్ ఆనంద్‌బాగ్ చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న షీ టాయిలెట్లను అధికారులకు చూయించారు. సఫిల్‌గూడ చెరువు వద్ద దోమల బెడద ఎక్కువగా ఉందని, ఎంటమాలజీ విభాగం అధికారుల తీరు సరిగ్గా లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

మీ సేవా కేంద్రాల వద్ద జనం బారులు

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ

రామంతాపూర్: కొత్త రేషన్‌కార్డులు, పాత రేషన్ కార్డులో కొత్తగా కుటుంబసభ్యుల పేర్లు చెప్పడం వంటి ప్రక్రియల కోసం ఉప్పల్ సర్కిల్‌లోని రామంతాపూర్ ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ మీ సేవా కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ మంగళవారం ప్రారంభమైంది. గత శనివారం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణపై పౌర సరఫరాలశాఖ మీ సేవల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించిన 24 గంటలు గడవకముందే తన నిర్ణయాన్ని మార్చుకుంది. ప్రజాపాలనలో తీసుకున్న లిఖిత పూర్వక దరఖాస్తుల పరిశీలనకే పరిమితం కావాలని నిర్ణయించుకుని, దరఖాస్తు స్వీకరణలను రద్దు చేసింది. దీంతో పలు ప్రాంతాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు పౌర సరఫరాలశాఖ రేషన్ దరఖాస్తుల స్వీకరణపై వ్యవహరించిన తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తిరిగి మంగళవారం రోజు రేషన్‌కార్డుల స్వీకరణ ప్రక్రియ చేపట్టినట్లు సమాచారం.


రామంతాపూర్ మీ సేవా కేంద్రంలో దరఖాస్తుదారులు